క్లుప్తంగా

మాలీలకు ఎస్టీ హోదా కల్పించడం హర్షణీయం

ఆదిలాబాద్‌టౌన్: మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, మండలిలో తీర్మానం చేయడం హర్షణీయమని మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కులే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నాయకులు స్వీట్లు పంచిపెట్టారు. 10 శాతం గిరిజన రిజర్వేషన్లలో వెంటనే మాలీలకు చోటు కల్పిస్తున్నట్లు జీవోను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబన్న షిండే, అంబేకర్, చంద్రశేఖర్, విజయ్, ఉత్తం, ధనంజయ, భాస్కర్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

ఇంద్రవెల్లి: ఖానాపూర్ నియోజకవర్గంలో ఈనెల 13 నుంచి 16 వరకు నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకులు వావల్కర్ శివాజీ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బహుజన బ్రతుకులు మారాలంటే బీఎస్పీ అధికారంలోకి రావాలన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ప్రజలు అండగా నిలువాలన్నారు.

సన్మార్గంలో నడవాలి

ఆదిలాబాద్: సన్మార్గంలో నడిచే వారికి అల్లా తోడుగా ఉంటాడని మహబూబ్‌నగర్ మదర్సా బాధ్యుడు హజ్రత్ మౌలానా అమీర్ ఉల్లాఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మొహ్మదియా దారుల్ ఉలూమ్ మదర్సా 50వ వార్షికోత్సవాన్ని స్థానిక ఈద్గా మైదానంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత ఆధ్యాత్మికతను అలవర్చుకొని తగాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జమాయిత్ ఉలేమా నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇలియాస్ అహ్మద్ హమీద్ ఖాస్మి, మొహ్మద్ జాహెద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, సాజిద్‌ఖాన్, యూనుస్ అక్బానీ, షేక్ నజీర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా సామగ్రిని అందజేస్తున్న మాజీ ఎంపీపీ

ఆదిలాబాద్‌రూరల్: క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎంపీపీ సెవ్వ లక్ష్మి జగదీష్ అన్నారు. ఆదివారం మండంలోని తంతోలి గ్రామానికి చెందిన యువజన సంఘ సభ్యులకు క్రికెట్, వాలీబాల్ క్రీడా సామగ్రి అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, నాయకులు మల్లేష్, రమేష్, లింగారెడ్డి, స్వామి, శ్రీనివాస్, జైపాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

ఎదులాపురం: పట్టణంలోని బాలాసీనగర్ కాలనీలో ఆవు మృతి చెందింది. కాలనీవాసి ఠాకూర్‌సింగ్ సంతోష్ గోమాత సేవా ఫౌండేషన్ సమాచారం ఇవ్వడంతో సభ్యులు స్పందించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతి చెందిన ఆవుకు పట్టణ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సురేష్, జగన్, సంతోష్, రాకేశ్, హేమాన్స్, రాజశేఖర్, రాజరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కైలాస్‌నగర్: నిరుపేదల ఆకలిని తీర్చేందుకు సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమం 99వ వారానికి చేరింది. ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్, న్యాయవాది సుధీర్ కుమార్, ఉపాధ్యాయుడు మాజిద్ ఖాన్, మహేందర్ రెడ్డి, సలీమ్, సుభాష్, పవన్, రాజయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని రిమ్స్‌లో అన్నదాన నిర్వహించారు. ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగుల సహాయకులకు అన్నదానం చేశారు. నిరుపేదలు ఆకలికి ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే 12వారాలుగా అన్నదానం చేస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ తెలిపారు. దశరథ్, సురేష్, రామకృష్ణ, విశాల్, గంభీర్ పాల్గొన్నారు.

పంచాయతీలకు భవనాలు మంజూరు

బోథ్: బోథ్ నియోజకవర్గంలోని 49 పంచాయతీలకు నూతన భవనాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ తెలిపారు. ఈమేరకు గిరిజన శాఖ జీవో విడుదల చేసిందన్నారు. గ్రామ పంచాయతీకి రూ. 20 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు.



మట్టిపాత్రలకు డిమాండ్



టీ కప్పులు

- రాజస్థాన్, గుజరాత్ నుంచి దిగుమతి
- మళ్లీ పాత కాలం వైపు అడుగులు
- పెరుగుతున్న ఆదరణ

కైలాస్‌నగర్: సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో ప్రజలు మళ్లీపాత కాలం వైపు అడుగులు వేస్తున్నారు. స్టీల్, ప్లాస్టిక్ పాత్రలకు అలవాటు పడిన జనం తాజాగా మట్టిపాత్రలపై ఆసక్తి చూపుతున్నారు. ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉండడంతో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మట్టిపాత్రలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో ప్రజల డిమాండ్ కనుగుణంగా జిల్లా కేంద్రంలో మట్టిపాత్రల విక్రయాలు సాగుతున్నాయి. టీ కప్పులు, గ్లాస్‌లు, తావ, దీపార్థులు, పెరుగు గిన్నెలు ఇలా నిత్యం ఇంట్లో ఉపయోగించే అన్ని రకాల వంట పాత్రలను స్థానిక వ్యాపారులు గుజరాత్, రాజస్థాన్ నుంచి తెప్పించి విక్రయాలు సాగిస్తున్నారు. బస్టాండ్ సమీపంలో, కలెక్టరేట్ చౌక్‌లో దుకాణాలు ఏర్పాటు చేసి, రూ.40 నుంచి రూ.800 వరకు మట్టి పాత్రలు అమ్ముతున్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో మట్టి కుండలను అందుబాటులో ఉంచారు. స్థానికంగా తయారు చేసిన రంజన్ల, రాజస్థాన్ కుండలు విక్రయిస్తున్నారు. నల్లటి మట్టి కుండలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. వీటిని రూ.200 నుంచి రూ.350 వరకు విక్రయిస్తున్నట్లుగా వ్యాపారులు చెబుతున్నారు.



మట్టితో తయారుచేసిన వాటర్ బాటిల్లు



వివిధ రకాల మట్టి పాత్రలు

రాజస్థాన్ కుండలపై ఆసక్తి



ప్రజల అభిరుచులకు అనువుగా అన్ని రకాల మట్టిపాత్రలను అందుబాటులో ఉంచుతున్నాం. స్థానికంగా తయారుచేసిన రంజన్లను సైతం విక్రయిస్తున్నాం. ప్రజలు రాజస్థానీ కుండలపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఎండలు ము దిరే కొద్ది విక్రయాలు పెరిగే అవకాశముంది.

– రాధ, విక్రయదారు

మట్టిపాత్రలకు ఆదరణ



మట్టిపాత్రల కొనుగోలుపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. వంట పాత్రలతో పాటు వాటర్‌బాటిళ్లు, టీ కప్పులు, గ్లాస్‌లు ఎక్కువగా మట్టితో తయారుచేసిన వాటినే కొనుగోలు చేస్తున్నారు. వంట పాత్రలను సైతం కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రజలకు అవసరమైన అన్ని రకాల పాత్రలను అందుబాటులో ఉంచాం.

– ఇందారం రాజు, వ్యాపారి

వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ రమేశ్

ఆదిలాబాద్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో సీసీరోడ్లు, డ్రెయినేజీలు, మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గంద్రత్ రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో గ్రామాల్లో కనీస మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడ్డారని విమర్శించారు. గిరిజన గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టేకం పార్వతిబాయి, వైస్ ఎంపీపీ జంగు, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, కనక రమణ, సుదర్శన్ పాల్గొన్నారు.

హీరాసుక్క జయంతి



పూజలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో ఆదివాసీ పురోహిత ప్రధాన్ కుల గురువు హీరాసుక్క జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ వాయిద్యాల మధ్య హీరాసుక్క చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్ మెస్రం రేణుకనాగ్‌నాథ్, మెస్రం వెంకట్‌రావ్, ఆర్క ఖమ్ము, మెస్రం దాదారావ్, తుకారం, మెస్రం మనోహర్, తోడసం సాగర్, గోడం లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

తలమడుగు: మండల కేంద్రంలో సబ్‌స్టేషన్ కార్యాలయంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని ఏఈ సతీష్ తెలిపారు. సోమవారం ఉదయం సబ్‌స్టేషన్‌లో తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల వినియోగదారులు విద్యుత్ బిల్లులు,ఇ తర సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

15న భీంపూర్ సర్వసభ్య సమావేశం

తాంసి: భీంపూర్ మండల సర్వసభ్య సమావేశం ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. భీంపూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ రత్నప్రభ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న రాయిసెంటర్ సభ్యులు

బోథ్: మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఆదివారం జరిగిన రాయిసెంటర్ సమావేశంలో సీఐ కిరణ్ కుమార్‌ను ఆదివాసీలు ఘనంగా సన్మానించారు. ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయాలు బాగున్నాయన్నారు. రాయిసెంటర్‌లను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ డైరెక్టర్ మెస్రం భూమన్న, సార్‌మెడి లక్ష్మణ్, గంగాధర్, లాలు, ఇస్రు, దేవ్‌రావ్, బండు, భీంరావ్, పురుషోత్తం, జైతు, గంగాధర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం ఉపసంహరించుకోవాలి

ఖానాపూర్: పలు బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చాలనే అసెంబ్లీ తీర్మానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కేవలం ఓటు బ్యాంకు రాజకీయం కోసమే ఈ తీర్మానాలను చేశారన్నారు. 15 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో కలపాలని ప్రభుత్వ కుట్రను గిరిజనులంతా గమనించాలన్నారు. గిరిజనులను మోసం చేసేందుకు కేసీఆర్ ఎత్తుగడలను గమనించాలన్నారు. తీర్మానం వెనక్కి తీసుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

అటెన్షన్ ప్లీజ్.. గుట్టలు మాయం



బోథ్: మండలంలోని బిర్లాగొంది సమీపంలో ఉన్న గుట్టను మొరం మాఫియా తవ్వేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు రూ. 10 లక్షల విలువైన మొరాన్ని తవ్వేశారు. మొరం తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: రవి కుమార్, మైనింగ్ అధికారి, ఫోన్: 99899 11736

‘హమారా ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలి’



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు పీడీయాక్ట్ నమోదు చేయాలని మాల సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ చౌరస్తాలో ప్రసాద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న మాట్లాడుతూ.. రాజ్యాంగం భారతదేశం ఒక గొప్ప ప్రజాస్వామిక దేశంగా మనుగడ సాగిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి బాబన్న, నాయకులు అర్థ దేవిదాస్, కాడె స్వామి, రాళ్ల బండి శంకర్, పోచన్న, అయిండ్ల శశికాంత్, సత్యనారాయణ, కిరణ్, రమేశ్ పాల్గొన్నారు.



ప్రసాద్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

పీడీయాక్ట్ నమోదు చేయాలి..

నేరడిగొండ: భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌పై పీడీయాక్ట్ నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కూడల స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహంకారభావంతో వ్యాఖ్యలు చేసిన ప్రసాద్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గజ్జల శంకర్, కారెం రవి, అశోక్, దశరథ్, చిన్నయ్య, ఈదుముల్ల శ్రీధర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం

- బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి



మాట్లాడుతున్న చిట్యాల సుహాసిని రెడ్డి

ఆదిలాబాద్: నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే జోగు రామన్న పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసిని రెడ్డి విమర్శించారు. పట్టణంలోని కైలాష్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన ప్రజాగోస.. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రం కార్నర్ మీటింగ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో అభివృద్ధి జరిగిందని బీఆర్‌ఎస్ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గందె విజయ్ కుమార్, నాంపల్లి వేణుగోపాల్, రాకేష్, మోహన్ అగర్వాల్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గాలు ఎన్నిక



జైనథ్: ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: బీసీ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కాల దత్తు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం గౌరవ అధ్యక్షుడిగా నర్సాగౌడ్, కోశాధికారిగా అంజయ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా మ్యాకల అశోక్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కలాల శ్రీనివాస్, అనుసూయ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పర్ధాన్ సమాజ్ కార్యవర్గం

జైనథ్: పర్ధాన్ సమాజ్ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడిగా సిడాం రాకేష్, అధ్యక్షుడిగా గంగప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కిన్నాకే సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా గెడం విఠల్, గెడం విష్ణులతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పర్ధాన్‌ల ఐక్యత, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వినోద్

ఆదిలాబాద్: ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శానం ప్రవీణ్, అధ్యక్షుడిగా గంట వినోద్, ప్రధాన కార్యదర్శిగా అవినాష్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రోహిత్, ఆర్గనైజ్ సెక్రెటరీగా సత్యం, కోశాధికారిగా అవునూరి శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

తలమడుగు: మండల కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో హోమం, పూర్ణాహుతి, కల్యాణం, చక్రస్నానం, ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. లయన్స్ క్లబ్ ప్రోగ్రాం ఆధికారి రమాకాంత్ లడ్డూలు పంపిణీ చేశారు. కల్యాణం అనంతరం స్వామి రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ ఆసం రవీందర్, సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీ చంటి, జాదవ్ బలరాం, తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీని బలోపేతం చేయాలి’

తలమడుగు: గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని జిల్లా రిటైర్డ్ టీచర్స్ ఉద్యోగ సంఘ అధ్యక్షుడు నల్ల రత్నాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దేవాపూర్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని గ్రామస్థాయిలో బలోపేతం చేసే దిశగా ప్రతీ కార్యకర్త కష్ట పడాలన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, కిరణ్, దేవన్న, రాజు, శేఖర్ శ్రీనివాస్, స్వామి, పోచ్చన్న, నరేష్, తదితరులు పాల్గొన్నారు.